అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

వెంగళరావునగర్, డిసెంబర్ 21: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు బల వన్మరణానికి పాల్పడ్డాడు. లోన్‌యాప్ వేధింపులే కారణమా..? ప్రియురాలి ఎడబాటు భరించలేకే ప్రాణాలు తీసుకున్నాడా..? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్ నివాసి ఎం.శివ (25) ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతడి తల్లిదండ్రులు బుధవారం రాత్రి బోరబండ తులసీనగర్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. అతడి సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా మాట్లాడలేదు. గడియ విరగొట్టి తలుపు తెరిచి చూడగా.. ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

లోన్‌యాప్ వేధింపులా.. ప్రియురాలి ఎడబాటా..!

గతంలో ఓ లోన్ యాప్ నుంచి శివ అప్పులు తీసుకున్నాడు. లోన్ యాప్ వేధింపులు పెరగడంతో.. అందిన కాడల్లా డబ్బు తెచ్చి.. లోన్‌యాప్ అప్పుల్ని కూడా మొత్తం తిరిగి చెల్లించేశాడని స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి శివ కొంత బాధతో ఉంటున్నాడని స్థానికులు అంటున్నారు. కాగా.. ఓ వివాహితతో కూడా అతడికి వివాహేతర సంబంధం ఉన్నదని.. ఆ సంబంధం బెడిసి కొట్టడంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెబుతున్నారు. ప్రియురాలి ఎడబాటు వల్లే ప్రాణాలు తీసుకున్నాడా.. అనే కోణంలో కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య..

దుండిగల్,డిసెంబర్21: ఆర్థిక ఇబ్బందులు తాళలేని ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన శరత్‌పాండా కొడుకు అనిల్‌పాండా(26) 7 నెలల క్రితం భార్య, కూతురితో కలిసి ఉపాధికోసం నగరానికి వలసవచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలోని ఎంబీగ్రామర్ స్కూల్ సమీపంలో నివాసముంటున్నారు. అనిల్ పాండా ఓ ప్రైవేట్ కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తుండేవాడు. గతకొన్ని రోజులు అనిల్ పాండా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇదే విషయమై దంపతుల మధ్య గొడవజరిగింది. అదేరోజు రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీవైద్యశాలకు తరలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తనభర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మానసిమిశ్రా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

మరో ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ..

శేరిలింగంపల్లి, డిసెంబర్ 21: ప్రేమ విఫలమై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జేయ్‌సూబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డ మండలం, బత్తులూరు గ్రామానికి చెందిన దంపతులు గజ్జల నాగశేషులు, రామలక్ష్మమ్మలకు ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు గజ్జల ఛక్రపాణి(28) నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. గచ్చిబౌలిలోని సాన్విక పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. రెండు రోజులుగా కార్యాలయానికి సెలవు పెట్టి ఛక్రపాణి హాస్టల్‌లోనే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం సొంతూరుకు చెందిన శివనాగరాజుతో హాస్టల్ బయట మాట్లాడి 2 గంటల సమయంలో హాస్టల్ గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకున్నాడు. రాత్రి 7:30 గంటల సమయంలో డ్యూటీ నుంచి వచ్చిన తన రూమ్‌మెట్ ఎంతపిలిచినా తలుపుతీయలేదు. కిటికీలోంచి చూడగా చక్రపాణి ఉరివేసుకొని కనిపించాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ప్రేమ విఫలమై చక్రపాణి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ఎర్రగడ్డ, డిసెంబర్ 21: యువతి అదృశ్యమైన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన ప్రకారం శంషాబాద్ ప్రాంతానికి చెందిన సౌజన్య(21) నర్సు కోర్సు కోసం అమీర్‌పేటలోని హెల్త్ కేర్ సొల్యూషన్స్ అనే సంస్థలో శిక్షణ తీసుకుంటున్నది. సౌజన్య వెంగళరావునగర్‌లోని ఎస్ఎస్‌వీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ రోజూ శిక్షణా తరగతులకు హాజరౌతున్నది. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పది రోజుల క్రితం హాస్టల్ గదిని ఖాళీ చేసింది. సౌజన్య అదృశ్యమైన విషయాన్ని కుటుంబ సభ్యులు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంట్లో బంగారు, వెండి నగలు చోరీ

ఎర్రగడ్డ, డిసెంబర్ 21: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు బద్దలు కొట్టి కప్‌బోర్డులో ఉన్న బంగారు, వెండి నగలతో అగంతకులు ఉడాయించిన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోరబండ ప్రాంతం ఎన్ఆర్ఆర్ పురం సైట్-1 కాలనీలో నివాసముంటున్న రమా మోహన్‌కుమార్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి పని మీద బయటకు వెళ్లారు. వారు ఇంటికి తిరిగొచ్చే సరికి తలుపులు బద్దలైనట్లు గమనించారు. లోపలికి వెళ్లి చూడగా గదిలోని కప్‌బోర్డులో ఉన్న బంగారు, వెండి నగలు మాయమయ్యాయి. చోరీకి గురైన నగల విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుంది. ఈ విషయమై బాధితులు గురువారం బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారుల కొరడా

మాదాపూర్, డిసెంబర్ 21: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. జోనల్ కమిషర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అయ్యప్పసొసైటీ, గోకుల్ ప్లాట్స్‌లోని నిర్మాణదారులు అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నాలుగవ రోజు కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని అన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేయడం జరుగుతుందని, నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా బహుళ అంతస్తుల నిర్మాణం చేట్టడం మంచిదికాదని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి నిర్మాణాలను చేపడితే చర్యలు తీసుకోకతప్పదని పేర్కొన్నారు. అయ్యప్ప సొసైటీలో నాలుగవ రోజు రెండు బహుళ అంతస్తులను కూల్చివేయగా గోకుల్ ప్లాట్స్‌లో మొదటిరోజు రెండు భవనాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు.

అయ్యప్పసొసైటీలో అక్రమనిర్మాణాల కూల్చివేత

క్రిస్మస్ సంబురాలు.. పాస్టర్లకు దుస్తుల పంపిణీ

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు పాస్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని.. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. పండుగ సందర్భంగా సొంత ఖర్చులతో 200 మంది పాస్టర్లకు దుస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబిహాబేగం, ముద్దం నర్సింహాయాదవ్, పాస్టర్స్ డెవిడ్, రత్నం తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21

నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం నిర్వహించిన ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో నృత్య ప్రదర్శనలు చేస్తు అలరిస్తున్న కళాకారులు

– కొండాపూర్, డిసెంబర్ 21

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు..

యూసుఫ్‌గూడలోని బ్రెడ్ ఆఫ్ లైఫ్ చర్చిలో పశువుల పాక అలంకరణ

జూబ్లీహిల్స్,డిసెంబర్21: క్రైస్తవులు ఈనెల 25 న జరుపుకోనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చ్‌లు ముస్తాబవుతున్నాయి. క్రిస్మస్ పర్వదినానికి నెలరోజుల ముందునుంచి క్రైస్తవులు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. చర్చ్‌ల ప్రాంగణాలను పశువుల పాకలు, స్టార్‌లు, క్రిస్మస్ తాతల బొమ్మలతో అలంకరిస్తున్నారు. యూసుఫ్‌గూడలోని పలు చర్చ్‌లను సుందరంగా అలంకరించేందుకు చర్చ్ కమిటీలు పనులు చేపడుతున్నాయి. ఆయా చర్చ్‌లలో ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.

కాలనీ సమస్యల పై ఉపకమిషనర్ కు వినతి

అల్లాపూర్,డిసెంబర్21: మోతినగర్ పరిధి అవంతినగర్ ఈస్ట్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాంటూ ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నెం కోటిరెడ్డి మూసాపేట సర్కల్-23 ఉపకమిషనర్ రమేష్ ను గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అంజేశారు. ఉపకమిషనర్ ను కలిసిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రావు, కమిటీ సభ్యులు ఎలందర్ రెడ్డి, పి.మల్లయ్య, సిహెచ్.రామాచారి, బుద్దబాబు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా ..

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎల్లమ్మబండా కాలనీవాసులు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 21: శేరిలింగంపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎల్లమ్మబండా ప్రాంతానికి చెందిన పలు బస్తీలు, కాలనీలకు చెందిన సభ్యులు, పార్టీ శ్రేణులు గురువారం నలగండ్లలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు మన సాంప్రదాయం స్ఫూర్తిగా నిలవాలి

ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, రిజర్వ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కొండాపూర్, డిసెంబర్ 21: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ క్యాంపస్‌లో 30 కాలనీలకు చెందిన మహిళలతో కలిసి ముత్యాల ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, 8వ బెటాలియన్ రిజర్వ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ హాజరయ్యారు. ఇందులో న్యాయనిర్ణేతలుగా తాటిచర్ల వరలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, ఆర్గనైజర్ తన్వీర్ బేగం తదితరులు ఉన్నారు.

ఘనంగా 'ఆనందోత్సవం-2023'

ఆకట్టుకున్న విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శన

దుండిగల్, డిసెంబర్21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని'వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్' ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు(20ఏండ్లు) పూర్తైన సందర్భంగా గురువారం సాయంత్రం 'ఆనందోత్సవం-2023' పేరుతో వేడుకలు నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా విండోస్ గ్రూప్ భాగస్వామి గొండి మంజుల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో పాఠశాల చైర్మన్ స్వరాజ్యలక్ష్మి, డైరెక్టర్లు అనితాచౌదరి, పద్మ, చరితాచౌదరి, నందకుమార్‌చౌదరి, ప్రధానోపాధ్యాయులు దుర్గాకుమార్‌రెడ్డి,కళాశాల ప్రిన్సిపల్ కనకరాజు, వైస్‌ప్రిన్సిపాల్ శ్రావణి, ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21 : పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు అపహాస్యం చేయడం బాధాకరమని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. పార్లమెంట్ భవనం ఆవరణలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధంకర్ పై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నేతల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, సూర్యారావు, కార్పొరేటర్ మహేందర్, వినోద్‌కుమార్‌గౌడ్, మనోహర్, వినోద్, శ్రీనివాస్, మల్లేశ్ ఉన్నారు.

ఆగిఉన్న కారులో మంటలు

మంటలు ఆర్పుతున్న స్థానికులు

దుండిగల్,డిసెంబర్21: నిలిపి ఉంచిన కారులోంచి మంటలు రావడం ప్రగతీనగర్‌లో కలకలం రేకెత్తింది. ప్రగతీనగర్ జగన్ స్టూడియో సమీపంలో గురువారం రాత్రి నిలిపి ఉంచిన కారులో ఇంజిన్‌పక్కన ఉండే బ్యాటరీ పేలింది. దీంతో కారులోంచి దట్టమైన పొగలతోపాటు మంటలు చెలరేగాయి. స్థానికులు స్పందించి నీళ్లు పోసి మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. సంఘటనపై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.